సాక్షి ఆదిలాబాద్

గురువారం । 20 । జూలై । 2023



బోథ్‌ను డివిజన్ చేయాలి..

బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బోథ్ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు మద్దతుగా మర్లపెల్లికి చెందిన వార్డు సభ్యురాలు శిరీష్ వినోద్ రాజీనామా చేశారు. 8లో▸

రిమ్స్‌లో ఓపీ సమయం పెంపు

ఆదిలాబాద్‌టౌన్: వ్యాధుల సీజన్ కావడంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో రద్దీ పెరిగిన దృష్ట్యా ఓపీ సేవలను మధ్యాహ్నం ఒంటి గంట వరకు పొడిగించినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. ఇదివరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఔట్ పేషెంట్ సేవలు ఉండగా, తాజాగా గంట పాటు పొడిగించినట్లు పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. జిల్లాకు 26 మంది ఎస్సైలను కేటాయించగా, అందులో 15 మంది బుధవారం ఎస్పీని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కేటాయించిన విధులు సక్రమంగా నిర్వర్తించాలని వారికి సూచించారు. జిల్లాలో ఆదివాసీలతో పాటు భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నాయని తెలిపారు. అప్రమత్తంగా ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షించాలని సూచించారు. త్వరలో పోస్టింగ్ కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐటీ టవర్ పనుల పరిశీలన

కైలాస్‌నగర్: ఐటీ టవర్ నిర్మాణంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డ్ పరిధిలో నిర్మిస్తున్న ఐటీ టవర్ నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. వెయ్యి మంది పనిచేసే సామర్థ్యంతో రూ.40 కోట్లతో టవర్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ పవన్ నాయక్, విలాస్, కలీం తదితరులున్నారు.

అప్రూవల్ కమిటీ ద్వారా లేఅవుట్ల ఆమోదం

కైలాస్‌నగర్: జిల్లా స్థాయి అప్రూవల్ కమిటీ ద్వారా లేఅవుట్లను ఆమోదించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం జిల్లాస్థాయి లే అవుట్ ఆమోద కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇచ్చోడ మండలం అడిగాం(కే) గ్రామ పంచాయితీ పరిధిలోని 3 ఎకరాల 72 సెంట్ల స్థలాన్ని జిల్లా స్థాయి డీటీసీపీ ద్వారా ఆమోదించినట్లు తెలిపారు. వీకర్ సెక్షన్ కింద ఏర్పాటు చేసిన ఈ లే అవుట్‌లో 140 ప్లాట్లను ఆమోదించినట్లు చెప్పారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, రోడ్లు భవనాలశాఖ, పంచాయతీరాజ్ ఈఈలు నర్సయ్య, మహావీర్, జిల్లా యువజనసంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, నీటిపారుదల శాఖ డీఈ లక్ష్మి, టౌన్‌ప్లానింగ్ అధికారి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టుల్లో బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ కళాశాలలో ఇంగ్లిష్, ఎకనామిక్స్, సివిక్స్, కెమిస్ట్రీ, ఇచ్చోడలో ఫిజిక్స్, మ్యాథ్స్, ఎంపీహెచ్‌డబ్ల్యూ (2), ఎంఎల్టీ 2, రిటైల్ మేనేజ్‌మెంట్ (2), ఆదిలాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, నార్నూర్‌లో జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్, తెలుగు, ఇంగ్లిష్, బోథ్‌లో కెమిస్ట్రీ, జువాలజీ, ఉర్దూ మీడియంలో బాటని, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఉర్దూ, నేరడిగొండలో తెలుగు, బేలలో ఫిజిక్స్, ఎకనామిక్స్, సివిక్స్ (2), తాంసిలో జువాలజీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్టీ, ఏఅండ్‌టి, గుడిహత్నూర్‌లో కామర్స్, ఆదిలాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తెలుగు మీడియంలో ఇంగ్లిష్, జువాలజీ, కామర్స్, ఇంగ్లిష్ మీడియంలో బాటని, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఉర్దూ మీడియంలో గణితం, ఫిజిక్స్, కామర్స్, పొలిటికల్ సైన్స్, కెమిస్ట్రీ, మరాఠీ మీడియంలో జువాలజీ, బాటని, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, మరాఠీ, ఇంద్రవెల్లిలో గణితం, ఫిజిక్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. దరఖాస్తులను డీఐఈవో కార్యాలయంలో ఈనెల 24 వరకు సమర్పించాలని సూచించారు.

'బీఆర్‌ఎస్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు..'

ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు, రైతులు సిద్ధమవుతున్నారని తెలంగాణ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి అన్నారు. రైతు భరోసా యాత్రలో భాగంగా బుధవారం ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో పర్యటించారు. జెడ్పీటీసీ చారులత, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి నాగాపూర్ గ్రామ రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో రైతులు విసిగెత్తి పోయారన్నారు. కార్యక్రమంలో ఖయ్యూం, ఇక్బాల్ పాల్గొన్నారు.



పొంగిపొర్లుతున్న వడగామ్ వాగు

తెరిపివ్వని వాన

- పొంగిన వాగులు..
- నిండుతున్న జలాశయాలు
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- తీవ్ర వర్షాభావ పరిస్థితుల నుంచి సాధారణ స్థాయికి

జిల్లాలో బుధవారం వర్షపాతం..	
సాధారణం: 9.9 మి.మీ	కురిసింది:53.9 మి.మీ.

జూన్ 1 నుంచి జూలై 19 వరకు..
సాధారణం: 377.1 మి.మీ.లు
కురిసింది :346.3 మి.మీ.లు
వ్యత్యాసం :– 8.0

మండలాల వారీగా..

మండలం	కురిసిన వర్షపాతం(మి.మీ.లలో)
తాంసి	71.3
ఆదిలాబాద్‌అర్బన్	68.2
ఇంద్రవెల్లి	64.4
జైనథ్	63.5
ఉట్నూర్	63.2
ఆదిలాబాద్‌రూరల్	61.1
గాదిగూడ	58.3
భీంపూర్	56.6
బజార్‌హత్నూర్	56.1
మావల	51.7
నార్నూర్	51.1
తలమడుగు	50.0
బేల	47.3
సిరికొండ	43.5
గుడిహత్నూర్	43.4
ఇచ్చోడ	42.6
బోథ్	41.9
నేరడిగొండ	35.4

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలో మూడు రోజుల క్రితం వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులు.. సోమవారం రాత్రి నుంచి మొదలైన ఎడతెరిపి లేని వానతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ప్రస్తుతం జిల్లా వర్షపాతం సాధారణ స్థితికి చేరుకుంది. ఇలాగే కురుస్తే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. నాలుగు మినహా మిగతా మండలాలు వర్షాభావ పరిస్థితుల్లో ఉండగా, ఈవానలతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం జిల్లాలో 14మండలాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. నాలుగు మండలా ల్లో నే వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఇక వర్షాకాలం మొదలై నెలన్నర దాటినా బోసిపోయినట్టుగా ఉన్న జలాశయాలకు ఊపిరి వచ్చింది. చెరువులు నిండుతున్నాయి. ప్రాజెక్టుల నీటిమట్టంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరుగుతున్నాయి. మొత్తంగా ఈ వానలతో అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లా అంతటా ..

నైరుతి రుతుపవనాల ప్రభావం కారణంగా జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం కూడా ఎడతెరిపి లేని వాన కొనసాగింది. ముసురు కమ్మేసింది. 18 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదైంది. జిల్లాలో 392 చెరువులు ఉండగా సగానికి పైగా నిండాయి. ప్రాజెక్టుల్లో నీటిమట్టం పెరుగుతూ వస్తుంది. జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 282.10 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కులు ఉంది. తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 275.00 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 100 క్యూసెక్కులు ఉంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని జైనథ్, ఆదిలాబాద్ అర్బన్, మావల, తలమడుగు మండలాల్లో ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి.మిగతా 14మండలాలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. సోమవారం తాంసి, ఆదిలాబాద్ అర్బన్, ఉట్నూర్, ఆదిలాబాద్‌రూరల్, ఇంద్రవెల్లి, జైనథ్‌లలో భారీ వర్షాలు కురిశాయి. మిగతా మండలాల్లోనూ ముసురు కొనసాగింది. ఎగువన కురుస్తున్న వర్షా ల కారణంగా పెన్‌గంగ నదికి ప్రవాహం పెరుగుతుంది. కుప్టి నుంచి ప్రవాహం దిగువకు వెళ్తుంది. కుంటాల, పొచ్చర, గాయత్రి జలపాతాలకు జలహోరు సందడి చేస్తుంది.

పొంగిన వాగులు

ఇంద్రవెల్లి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా మండలంలోని వడగామ్, మామిడిగూడ, జైత్రంతండా, చిత్తబట్ట, గోపాల్‌పూర్ గ్రామాల్లోని వాగులు పొంగిపొర్లాయి. మామిడిగూడ, చిత్తబట్ట గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో వైద్యాధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో ప్రతిరోజు వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. రోజువారి కార్యక్రమాలను మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైద్యాధికారులు అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు శ్రీధర్, వైసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

జాతీయ నులిపురుగు నివారణ దినం పురస్కరించుకొని నేడు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఏడాది నుంచి 19ఏళ్ల లోపు ఉన్న లక్ష 92వేల 725 మందికి మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నులిపురుగు కారణంగా పిల్లల్లో ఎదుగుదల లోపం, వివిధ రుగ్మతలు వస్తాయన్నారు. రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడుతుందని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలో కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- మెనూ మారినా.. భోజనం మారలే
- నాసిరకం భోజనంతో విద్యార్థుల అవస్థలు
- అధికారుల పర్యవేక్షణ కరువు

మెనో!



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న నిర్వాహకురాలు



ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం కేవలం పప్పు, అన్నం మాత్రమే వడ్డించారు. కోడిగుడ్డు ఇవ్వలేదు. అలాగే కూరగాయలు, ఆకుకూరలతో భోజనం పెట్టాల్సి ఉండగా, కేవలం నీళ్ల పప్పే దిక్కయ్యింది.

- నార్నూర్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఏకలవ్య ఆదర్శ గురుకులంలో గత మార్చిలో నాసిరకం భోజనం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శ్వాస సమస్యతో ఆస్పత్రి పాలయ్యారు.
- ఇదివరకు ఆదిలాబాద్ పట్టణంలోని రూరల్ కేజీబీవీలో, అలాగే జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న భీంపూర్ కేజీబీవీలో, నేరడిగొండ కేజీబీవీలో, తాంసి మండలంలోని ఘోట్కురి పాఠశాలల్లో నాసిరకం భోజనం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. అయినా జిల్లాలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులకు నాసిరకం భోజనమే దిక్కవుతుంది.

జిల్లాలో..

మధ్యాహ్న భోజనం అమలయ్యే పాఠశాలలు 1,139

ఇందులో విద్యార్థులు 71,241

పాఠశాలలు	సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	917	42,740
ప్రాథమికోన్నత	111	18,290
ఉన్నత	110	10,211

మెనూ ఇది..

వారం	పెట్టాల్సిన భోజనం
సోమ	కిచిడీ, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి, కోడిగుడ్డు
మంగళ	అన్నం, పప్పు, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి
బుధ	అన్నం, ఆకుకూరలతో పప్పు, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి, కోడిగుడ్డు
గురు	వెజిటెబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రి
శుక్ర	అన్నం, సాంబార్, మిక్స్ డ్ వెజిటెబుల్ కర్రి, కోడిగుడ్డు
శని	అన్నం, ఆకుకూరలు, వెజిటెబుల్ కర్రి.

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మెనూ మార్చినప్పటికీ పాఠశాలల్లో మాత్రం తీరు మారలేదు. వారికి నాసిరకం భోజనమే దిక్కవుతుంది. దీంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. గతంలో పలుమార్లు చిన్నారులు ఆస్పత్రి పాలైన ఘటనలు ఉన్నా మేమింతే.. మా తీరు మారదన్న విధంగా అధికారులు, కొంత మంది ఉపాధ్యాయులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగా సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఉడకని అన్నం, నీళ్లపప్పు పెడుతున్నట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపమే కారణంగా తెలుస్తోంది.సంఘటనలు జరిగినప్పుడు మెమోలు ఇవ్వడం, సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం తప్పా శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలున్నాయి.

గుడ్డు మింగేస్తున్నారు..

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారానికి మూడు రోజులు కోడిగుడ్లను అందజేస్తోంది. ఇందు కోసం ఒక్కో గుడ్డుకు రూ.5 చొప్పున కేటాయిస్తుంది. ప్రాథమిక విద్యార్థులకు కుగింగ్ కాస్ట్ కోసం రూ.5.45, 6నుంచి 8 తరగతుల విద్యార్థులకు రూ.8.17లతో పాటు 9,10 తరగతుల విద్యార్థుల కోసం రూ.10.67లను కేటాయిస్తుంది. అయితే చాలా పాఠశాలల్లో వారానికి ఒక రోజు మాత్రమే గుడ్డు పెడుతున్నారు. మిగతా రోజుల్లో మాములు భోజనం అందిస్తున్నారు.

పర్యవేక్షణ కరువు..

అధికారుల పర్యవేక్ష లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు ఆకుకూరలు, కూరగాయలు, పప్పు, కోడిగుడ్డుతో భోజనం వండి పెట్టాల్సి ఉండగా, చాలా పాఠశాలల్లో నాసిరకం భోజనమే అందిస్తున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు ఇంటికెళ్లి భోజనం చేస్తుండగా, మరికొంత మంది టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నారు. ఎంఈవోలు రోజుకు మూడు పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉండగా, కార్యాలయానికే పరిమితం కావడంతో పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలున్నాయి.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం తప్పనిసరిగా భోజనం పెట్టాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించాలి. వంట గదులు శుభ్రంగా ఉంచాలి. వారానికి మూడు సార్లు కోడిగుడ్లు అందించాలి. – ప్రణీత, డీఈవో

ఎక్కడి చెత్త అక్కడే..!



ఇది తాంసి మండల కేంద్రంలో ఇంటింటా చెత్త సేకరణకు ఉపయోగించాల్సిన ట్రాక్టర్. పంచాయతీ కార్మికుల సమ్మె కారణంగా పంచాయతీ నుంచి కదలడం లేదు. అందులో వేసిన చెత్త కూడా అలాగే ఉండటం గమనార్హం.



నేరడిగొండ మండలం కోర్టికల్–బి గ్రామంలో పారిశుధ్య నిర్వహణ దుస్థితి ఇది. మురుగు నీరంతా ఇలా పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారుతుంది. ఫలితంగా వ్యాధులకు కారణమవుతోంది.

జిల్లాలో..

గ్రామ పంచాయతీలు : 468

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ : 1485



నేరడిగొండ మండలం కుమారీలో డ్రెయినేజీ దుస్థితి

- సమ్మెబాటలో పంచాయతీ కార్మికులు
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్య నిర్వహణ
- కంపు కొడుతున్న వీధులు.. ప్రబలుతున్న వ్యాధులు
- పట్టించుకోని అధికారులు

కైలాస్‌నగర్: తమ డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు నిలిచిపోయాయి. రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. దుర్గంధంతో వీధులు కంపు కొడుతున్నాయి. అసలే వర్షాకాలం. ఇప్పటికే వ్యాధులు ప్రబలుతున్నాయి. ఏటా ఈ సమయంలో పారిశుధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించేది. ఈ సారి అలాంటి చర్యలేవీ కనిపించడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే వ్యాధుల తీవ్రత పెరిగే అవకాశముందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది.

కంపు కొడుతున్న గ్రామాలు

కార్మికుల విధుల బహిష్కరణతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పడకేసింది. దీంతో గ్రామాలు కంపుకొడుతున్నాయి. దోమల తీవ్రత పెరిగి సీజనల్ వ్యాధులు సైతం ప్రబలుతున్నాయి. రిమ్స్‌తో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

దుర్గంధ భరితంగా మరుగుదొడ్లు

సర్కారు పాఠశాలల్లో పనిచేసే స్వీపర్లు/స్కావెంజర్లను తొలగించిన ప్రభుత్వం వాటి పరిశుభ్రత బాధ్యతలను గ్రామ పంచాయతీలకే అప్పగించింది. సమ్మె కారణంగా రెండు వారాలుగా కార్మికులు పాఠశాలల వైపు వెళ్లడం లేదు. దీంతో పరిసరాలను శుభ్రం చేసేవారు కరువయ్యారు. ఫలితంగా బడిలో మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది.

కనిపించని ప్రత్యామ్నాయ చర్యలు

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాల్సిన జిల్లా పంచాయతీ శాఖ అధికారులు ఆ దిశగా దృష్టి సారించినట్లుగా కనిపించడం లేదు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా కొంతమంది సర్పంచ్‌లే స్వచ్ఛందంగా డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడుతున్నా అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేకపోవడం గమనార్హం.

14వ రోజుకు సమ్మె

ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనం చెల్లించాలనే డిమాండ్లతో జీపీ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. విధులు బహిష్కరించి 14 రోజులుగా మండల కేంద్రాల్లో ఆందోళన కొనసాగిస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం.. కార్మికులు సైతం పట్టువీడకపోవడం గమనార్హం.

ప్రభుత్వం దిగివచ్చేదాకా సమ్మె



ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లపై చర్చలు జరుపాలి. ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.15600 చెల్లించాలి. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ వంటి సదుపాయాలను కల్పించాలి. వీటిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేంతవరకు సమ్మె ఆపేదిలేదు.

– కిరణ్‌కుమార్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

ఇబ్బందుల్లేకుండా చర్యలు



కార్మికుల సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. ప్రత్యామ్నాయంగా 700 మందిని తాత్కాలికంగా నియమించుకుని పరిశుభ్రత పనులు చేపడుతున్నాం. ఎక్కడైనా ఇబ్బందికరమైన పరిస్థితి ఉంటే మా దృష్టికి తీసుకువస్తే అవసరమైన చర్యలు చేపడుతాం.

– శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

సమగ్ర ఓటరు జాబితా రూపొందించాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించి సమగ్ర ఓటరు జాబితా తయారీకి కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. అర్హులందరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలని, అలాగే జాబితాలో తప్పులను సవరించాలని, మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించాలని సూచించారు. గరుడ యాప్, కొత్త ఓటర్ల నమోదు, మరణ ధ్రువీకరణ, నివాసం మార్పు, వివరాల సవరణ, తదితర అంశాలను వివరించారు. ఇందులో తహసీల్దార్ సతీశ్, నాయబ్ తహసీల్దార్లు సాయి మహేశ్, సూపర్‌వైజర్లు, బూత్‌స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్..

ఎలాంటి పొరపాట్లకు తావులేని ఓటరు జాబితా రూపకల్పనపై తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమగ్ర ఓటరు జాబితాపై బూత్ లెవెల్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరించే బీఎల్‌వోలకు ప్రతీ అంశంపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి సర్వే ద్వారా జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు, తొలగింపులు ఉంటే ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా సంబంధిత 6, 6ఏ, 6బి, 7, 8 ఫారాల ద్వారా చేపట్టేలా చూడాలన్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి


షేక్ ఇర్ఫాన్(ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన యువకుడు చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగుచూసింది. ఎస్సై భరత్‌సుమన్ వివరాల ప్రకారం.. షేక్ ఇర్ఫాన్ (25) మంగళవారం ఉదయం నుంచి కనబడకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి చెరువు వద్ద చెప్పులు కనిపించడంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుధవారం తెలిపారు. ఇర్ఫాన్‌కు భార్య గౌసియా, బాబు ఉన్నాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ మృతదేహాన్ని పరిశీలించి ప్రగాఢసానుభూతి తెలియచేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తానూరు: మండలంలోని బోంద్రట్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బెల్‌తరోడ గ్రామానికి చెందిన శ్యాంరావు కాలినడకన బోంద్రట్ నుంచి బెల్‌తరోడ గ్రామానికి వస్తున్నాడు. మహారాష్ట్రలోని లగుబడ్ గ్రామానికి చెందిన బాలు ద్విచక్రవాహనంపై భైంసా నుంచి భోకర్‌వైపు వెళ్తున్నాడు. బోంద్రట్ గ్రామ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న శ్యాంరావును బాలు ద్విచక్రవాహనంతో ఢీని కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన శ్యాంరావు, బాలును స్థానికులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

స్వల్పంగా పెరిగిన మత్తడి వాగు నీటిమట్టం


ప్రాజెక్టులో స్వల్పంగా పెరిగిన నీటిమట్టం

తాంసి: వరుసగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని వడ్డాడి సమీపంలో మత్తడివాగు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి వచ్చిన వరదనీరు ప్రాజెక్టులోకి నీటిమట్టం స్వల్పంగా పెరుగనుంది. ఎగువన కురిసిన వర్షాలతో బుధవారం ప్రాజెక్టులోకి 100 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. వరదనీరు స్వల్పంగా చేరడంతో ప్రాజెక్టులో నీటిమట్టం 275 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం 275 మీటర్లు ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ హరీష్ కుమార్ తెలిపారు.

గోడకూలి ఒకరికి గాయాలు

సిరికొండ: కొన్నిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని లక్ష్మీపూర్(కే) గ్రామానికి చెందిన కరాటే కైలాస్‌కు చెందిన ఇంటిగోడ మంగళవారం రాత్రి కూలింది. గోడ పైన పడడంతో కైలాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అతడి వెంట భార్య, పిల్లలు కూడా అదే ఇంట్లో నిద్రిస్తుండగా వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రస్తుతం కై లాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గెస్ట్ లెక్చరర్ల నిరసన


నిరసన తెలుపుతున్న గెస్ట్ లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని తెలంగాణ గెస్ట్ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణు యాదవ్ మాట్లాడుతూ రెగ్యులర్ లెక్చరర్లతో సమానంగా విధులు నిర్వహించినప్పటికీ తమను తొలగించి కొత్తవారిని నియమించడానికి నోటిఫికేషన్ విడుదల చేయడం సరికాదని మండిపడ్డారు. పదేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ కమిషనర్ నవీన్ మిత్తల్ నోటిఫికేషన్ విడుదల చేశారని, ఆ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజేందర్, యాఖుబ్ పాషా, మధుసూదన్ పాల్గొన్నారు.

ఏళ్లుగా ఇదే గోస



ఈ ఫొటోలో కనిపిస్తున్న గ్రామం అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్ను మారుతిగూడ. ఈ గ్రామం మూడేళ్ల కిందట ఏర్పడింది. ఇక్కడ 12గృహాలు ఉండగా 50 నుంచి 60 మంది నివసిస్తున్నారు. ఈ గ్రామానికి 300 మీటర్ల దూరంలోని బీటీ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు సౌకర్యం లేక గత ఏడాది వర్షాకాలంలో గ్రామస్తులు బురదలో ఇద్దరు గర్భిణులను మంచంపై బీటీ రోడ్డు వరకు తీసుకువెళ్లిన దుస్థితి. ఈ గ్రామంలో పాఠశాల లేక విద్యార్థులు కాలినడకన 500మీటర్ల దూరంలోని పాఠశాలకు వెళ్తున్నారు. ఈ పరిస్థితి కేవలం చిన్ను మారుతిగూడది మాత్రమే కాదు. మిగితా గ్రామాల పరిస్థితి ఇదే..


చిన్ను మారుతిగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు..

- సమస్యల్లో అంకాపూర్, ఆరు అనుబంధ గ్రామాలు..
- గ్రామాల్లో కనిపించని కనీస సౌకర్యాలు
- కానరాని రోడ్లు.. డ్రైనేజీ లేక దారులపై మురుగు
- తాగునీటికి తప్పని కష్టాలు..
- వారానికోసారి భగీరథ నీరు..
- అనారోగ్యాల బారిన గిరిజనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


గ్రామంలో నిరుపయోగంగా వాటర్ ట్యాంక్


కాలినడకన బాలింతను తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా... నేటికి పలు గిరిజన గ్రామాల ప్రజలు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. దీనికి ఉదాహరణే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో దొండరిగూడ, రాములుగూడ, పెద్దపందిర్‌లొద్దీ, చిన్న పందిర్‌లొద్దీ, చిన్ను మారుతిగూడ, కొలాంగూడ గ్రామాలున్నాయి. అనుబంధ గ్రామాలను కలుపుకోని ఈ పంచాయతీ పరిధిలో 257 గృహాలు ఉండగా 2011 జనాభా లెక్కాల ప్రకారం 917జనాభా ఉంది. ఆయా గ్రామాల్లో కనీస మౌలిక వసతులైన సీసీ రోడ్డు, మురికి కాలువలు లేవు. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో పాటు మురుగునీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. తమ గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని పలువురు యువకులు ఇటీవల ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లారు.

సరఫరా కానీ మిషన్ భగీరథ నీరు..

పైపుల లీకేజీలతో గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు వారం, పదిరోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ఎప్పుడో ఓసారి నీరు సరఫరా అవుతున్నప్పటికీ అవి కూడా కలుషిత నీరే వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే చిన్ను మారుతి గూడ గ్రామానికి మిషన్ భగీరథ పైపులైన్ లేక వారు వారి గ్రామానికి కొన్ని మీటర్ల దూరంలోని చిన్న పందిరల్‌లొద్దీ గ్రామం నుంచి నల్లా పైపు ద్వారా నీటిని సరఫరా చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు. గ్రామంలో కనీసం చేతి పంపు కూడా లేక చిన్న పందిర్‌లొద్దీ గ్రామంలోని చేతి పంపు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అలాగే ఏటా వర్షాకాలంలో బురదరోడ్లపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అంగన్ వాడీ కేంద్రాలు లేక చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందడం లేదు.

సొంత నిధులతో విద్యుత్ ఏర్పాటు

కొన్ని గ్రామాలకు ప్రభుత్వం విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో గ్రామస్తులు ఇంటికి కొంత చందాలు వసూలు చేసి విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్ కొనుగోలు చేసుకోని విద్యుత్ సౌకర్యం కల్పించుకున్నారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు లేక పలు గ్రామాలు రాత్రి అందకారంలో ఉంటున్నాయని వాపోతున్నారు.

అవస్థలు పడుతున్నాం



మా గ్రామంలోకి రోడ్డు సౌకర్యం లేదు. వర్షాకాలంలో రోడ్డంతా బురదగా ఉంటుంది. కాలినడకనే గ్రామానికి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నాం. గ్రామంలోకి వాహనాలు వెళ్లే సౌకర్యం లేదు. మా గ్రామానికి కొన్ని మీటర్ల దూరంలో ఉన్న బీటీ రోడ్డు పక్కానే వాహనాలు పార్కింగ్ చేస్తున్నాం.
– రాము, గ్రామస్తుడు, చిన్ను మారుతి గూడ

మంచాలపై తీసుకెళ్లినాం



తమ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. గత ఏడాది వర్ష కాలంలో ఇద్దరు గర్భిణులను మంచాలపై బీటీ రోడ్డు వరకు తీసుకెళ్లినాం. అనంతరం 108 వాహనంలో రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లినాం. తమను పట్టించుకోవాలని పదిహేను రోజుల కింద పీవోను కలిశాం.
– సిడాం లక్ష్మణ్, చిన్ను మారుతి గూడ

చందాలతో వెలుగులు



తమ గ్రామానికి మిషన్ భగీరథ పైపు లైన్ లేదు. తమ గ్రామానికి కొన్ని మీటర్ల దూరంలోని ఊరు నుంచి నల్లా పైపు ద్వారా నీటిని సరఫరా చేసుకుంటున్నాం. ఆ నీళ్లు కూడా వారానికి ఓసారి వస్తే లేవు. నీళ్లు రానప్పుడు అదే ఊరులోని బోరింగ్ నుంచి తెచ్చుకుంటున్నాం.
– సిడాం పద్మలత, చిన్ను మారుతిగూడ

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా

కేయూ క్యాంపస్ : తెలంగాణలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 20 (నేటి నుంచి) నుంచి ప్రారంభం కానున్న వివిధ విభాగాల్లోని పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాల ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ మేరకు బుధవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన డీన్లు, విభాగాధిపతులు, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు, ఇతర అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని, మరిన్ని వివరాలకోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడాలని శ్రీనివాసరావు వెల్లడించారు.

మాలీల ఎస్టీ హోదాపై ఏకగ్రీవ తీర్మానం


పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మాలి సంఘం నేతలు

ఆదిలాబాద్‌రూరల్: అన్ని రంగాల్లో వెనుకబడిన తెలంగాణ మాలీలకు ఎస్టీ హోదా అంశంపై ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం అభినందనీయమని, ఇక కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని మాలీ జాతీయ సదస్సులో తీర్మానం చేశారన్నారు. అఖిల భారతీయ మాలీ మహా సంఘం 22వ స్థాపన దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన పలువురు మాలీ కులస్తులు పాల్గొన్నారని, జాతీయస్థాయి నేతలంతా సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని సమర్థించారని తెలిపారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ నుంచి సంఘ కార్యకర్తలు సుభాష్ షెండే, మురళీధర్ నాగోషే, గజానంద్ చౌదరి, ధనంజయ ప్రధాన్, వాడగురే విజయ్, కల్పన పెట్కులే, లక్ష్మి షిండే, అంబాదా పాల్గొన్నారు.

బోథ్‌ను డివిజన్ చేయాలి..


డివిజన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

- డివిజన్ కోసం రాజీనామా చేసిన వార్డు సభ్యురాలు
- కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేను కలిసిన డివిజన్ సాధన సమితి సభ్యులు
- కొనసాగుతున్న దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా చేయాల్సిందేనని బోథ్ డివిజన్ సాధన సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. డివిజన్ సాధనలో భాగంగా బుధవారం మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు కట్ట శిరీష్ వినోద్ రాజీనామా చేశారు. దీక్షా శిబిరంలో రాజీనామాను చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె రాజీనామా పత్రాన్ని అందజేశారు. కొన్నేళ్లుగా డివిజన్‌గా చేయాలని కోరుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె తెలిపారు.

కలెక్టర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు..

ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌లను డివిజన్ సాధన సభ్యులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. 2022లోనే సీసీఎల్ఏకు ప్రతిపాదనలు వెళ్లాయని ఎమ్మెల్యే బాపూరావ్ తెలిపారు. డివిజన్ ఏర్పాటు ప్రభుత్వం పరిశీలనలో ఉందని, త్వరలోనే డివిజన్ ఏర్పాటు అవుతుందని తెలిపారు. అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని కలిశారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయకుండా ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారన్నారు. బోథ్‌లోనే డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్నతాధికారులకు పంపిస్తామని కలెక్టర్ పేర్కొనట్లు సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు.

దీక్షలో కూర్చున్న మర్లపెల్లి గ్రామస్తులు...

డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో చేస్తున్న దీక్షలు బుధవారానికి 3వ రోజుకు చేరుకున్నాయి. మూడవ రోజున మర్లపెల్లి గ్రామస్తులు దీక్ష చేపట్టారు. గురువారం సోషల్ మీడియా క్యాంపును నిర్వహించనున్నారు. రానున్న రోజుల్లో ప్రణాళికలను రూపొందించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు పేర్కొంటున్నారు.

సిడాం శంభు 5వ వర్ధంతిని విజయవంతం చేయండి

- తుడుం దెబ్బ పిలుపు


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఉట్నూర్‌లోని మత్తడిగూడలో గురువారం జరిగే సిడాం శంభు 5వ వర్ధంతిని జిల్లాలోని ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. బుధవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 72లోని కుమురంభీం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ అమరజీవి తుడుం దెబ్బ వ్యవస్థాపక సభ్యులు, ఆదివాసీ పోరాట యోధుడు, సమాజం అభివృద్ధి కోసం నిరంతరంగా పోరాడం జరిగిందన్నారు. జల్, జంగల్, జమీన్, స్వయం పరిపాలన, మా ఊళ్లో మా రాజ్యం (మావ నాటే మావ రాజ్) కోసం అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. ఆదివాసీలకు పోడు భూముల సమస్య నుంచి పరిష్కారం త్వరగా రావాలని కోరుకున్న మొదటి వ్యక్తిని పేర్కొన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు రావాలని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట పలుమార్లు రాస్తారోకో, ధర్నాలు చేశారన్నారు. అలాగే ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధాన శైలిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో తుడుం జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మావల మండల అధ్యక్షుడు ఆత్రం గణపతి, నాయకులు ఆత్రం బుజంగ్‌రావు, తొడసం ప్రకాష్, దుర్వ లింగు పాల్గొన్నారు.

23న ఆదివాసీ తొమ్మిది తెగల ఐక్యత సమావేశం


మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: ఈ నెల 23న మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఆదివాసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ 9 తెగల ఐక్యతపై సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆదివాసీ సంఘాల పెద్దలు తెలిపారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ సమన్వయ కమిటీ అధ్యక్షులు సిడాం భీంరావ్ ఆధ్వర్యంలో 9 తెగల ఆదివాసీల ఐక్యతపై చర్చించనున్నట్లు వివరించారు. ఉమ్మడి జిల్లాలోని 9 తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘం, తెలంగాణ గిరిజన సంఘాల నాయకులతో పాటు రాయిసెంటర్ సార్‌మేడిలు, ఆయా గ్రామాల పటేళ్లు, పెద్దలు, ఆదివాసీ కార్మిక, కర్షక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిడాం భీంరావ్, ఆర్క ఖమ్ము, కనక తుకారం, సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావ్, తుంరం జుగాదిరావ్, నాయకులు మెస్రం నాగ్‌నాథ్, జ్యోతిరాం, తోడసం నాగోరావ్, తోడసం సాగర్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి


ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయక్ ఉపాధ్యాయులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం ఉట్నూర్‌లోని బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, మోడల్ స్పోర్ట్స్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టోర్ రూమ్‌ను పరిశీలించి సరుకులను రికార్డులు ప్రతీ రోజు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వంటగదిలో శుభ్రతను, బియ్యం, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్, సిబ్బందికి సూచించారు. తరగతి గదిలో విద్యార్థులతో సంభాషించి సబ్జెక్టుల వారిగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. ప్రతీ విద్యార్థిలో అభ్యాస సామర్థ్యాలకు పెంచేలా విద్యా బోధన చేయాలని ఆదేశించారు. అక్షర జ్యోతి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, సబ్జెక్టుల వారిగా బోధన తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుడా పాఠశాలల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐఐటీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల అందచేత

గిరి విద్యార్థులు ఐఐటీలలో సీట్లు సాధించడం అభినందనీయమని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని బోథ్ మండలం పార్డిపాల్ సింగ్ నాయక్ తండాకు చెందిన ఆడే రూపేష్, నార్నూర్ మండలం సోనాపూర్, ఉమ్రి గ్రామాలకు చెందిన రాథోడ్ నితీశ్, జాదవ్ రాజు, కోటపెల్లి మండలం గొప్పారంకు చెందిన రవికుమార్, బెల్లంపల్లి మండలం తాళ్ల గిరిజన గ్రామానికి చెందిన నిత్యశ్రీలు దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థల్లో సీట్లు సాధించారని తెలిపారు. అందుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ప్రతిభగల విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

వాగు దాటి వైద్యం


జైత్రంతండా వాగుదాటుతున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: రెండు రోజులుగా మండల కేంద్రంతో పాటు మండలంలోని భారీ వర్షాలు కురువడంతో వాగులో వరదనీరు పొంగిపొర్లుతున్న వైద్య సిబ్బంది వాగులు దాటి గ్రామాలను సందర్శించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. బుధవారం ఇమ్యునైజేషన్ టీకాల కార్యక్రమంతో పాటు ర్యాపిడ్ ఫీవర్ సర్వే ఉండడంతో మండలంలోని జైత్రంతండా, మామిడిగూడ గ్రామస్తుల సాయంతో ఏఎన్ఎం విజయసుందరి, వడగామ్ ఆశ వర్కర్ ఆత్రం అనసూయలు వాగు దాటి గ్రామాలను సందర్శించి రోగులకు వైద్యం అందించారు. చిన్న పిల్లలకు, గర్భిణి, బాలింతలకు ఇమ్యునైజేషన్ టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడారు. మండలంలోని మామిడిగూడ, జైత్రంతండా గ్రామాలకు రోడ్డులేక, వాగుల వద్ద వంతెనలు లేక వర్షాకాలంలో కష్టమవుతుందని, అయినా వరదనీరు తగ్గిన తరువాత గ్రామాల్లో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని జైజవాన్‌నగర్‌లో బుధవారం పేకాటాడుతున్న నలుగురిని టూటౌన్ సీఐ అశోక్ అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. మధ్యాహ్న సమయంలో ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మూడు ముక్కలాట ఆడుతూ కనిపించడంతో వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.4660 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన తుల అరుణ్‌కుమార్


మాణిక్‌రావు ఠాక్రే, కోమటి రెడ్డితో అరుణ్‌కుమార్

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన తుల అరుణ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. హైదరాబాద్‌లోని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాసంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రె ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అరుణ్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. గతంలో సుభాష్‌ను మావోయిస్టులు చంపివేయడంతో అప్పుడు వైఎస్సార్ సొనాలకు వచ్చి వారి కుటుంబాన్ని పరామర్శించినట్లు వివరించారు. తన తండ్రి ఆశయ సాధన కోసం తాను పార్టీలో చేరినట్లు అరుణ్ పేర్కొన్నారు.

కట్కం మురళికి డాక్టరేట్


కట్కం మురళి

నిర్మల్ ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కట్కం మురళికి ఉస్మానియా విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. భైంసా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కోటలు, గడీలు' అనే అంశంపై పీహెచ్‌డీ పరిశోధనను పూర్తి చేశారు.